
# గోరంత దీపం



'జాగృతి' వారపత్రిక . . . 5 మే, 2003

కాశ్మీరం!

అది ఒకనాడు భరతమాతకు కుంకుమ తిలకం..!

కానీ ఈనాడు?!

నిరంతరం పచ్చినెత్తురోడుతున్న రక్తతిలకం!

భూతల స్వర్గవాసులు నిత్యం నరకయాతనల ననుభవిస్తుండడానకి ఎవరు కారణం? ఎవరిది బాధ్యత?!

మూడు వందల సంవత్సరాల క్రితం కాశ్మీరం పూర్తిగా హిందూ రాజ్యం! ప్రాచీన భారతీయ పురాణ, ఇతిహాసాలలో పేర్కొని చెప్పిన (అరవై నాలుగు) దేశాలలో ఒకటి... భారతదేశంలో అంతర్భాగం... హైందవ సంస్కృతికి దర్పణం!

అటుతర్వాత ఆ భూతల స్వర్గం దానవుల పాలబడింది. అది పఠాన్ జాతి మహమ్మదీయుల దండయాత్రలకు గురి అయింది. ముస్లిం రాజుల పాలనలోకి వెళ్లిపోయింది. పర మత పొడ గిట్టని ముస్లింపాలకులు నయానా, భయాన లక్షలాది హిందువులను ముస్లింలుగా మార్చసాగారు. గత్యంతరం లేక వేలాది హిందువులు మహమ్మదీయులుగా మారిపోయారు.

అయినప్పటికీ మరెన్నో లక్షల మంది హిందువులు ప్రాణాలు పోగొట్టుకోడానికైనా సిద్ధపడ్డారు కానీ, ముస్లింలుగా మారడానికి అంగీకరించలేదు. కాశ్మీర్‌లో అత్యంత సుందరమైన సరస్సు 'దాల్ సరస్సు.' దీనిలో ఇప్పటికీ 'బాటా మజార్' అనే చిన్నద్వీపం ఉంది. అది ఎలా ఆవిర్భవించిందో తెలుసుకుంటే ఒడలు జలదరిస్తుంది.

– ముస్లింలుగా మారడానికి ఇష్టపడని హిందువులను పడవలలో సరస్సు మధ్యకి తీసుకువెళ్లేవారు. అక్కడ వారిని "ముస్లింగా మారతారా, లేదా? సరస్సులోకి నెట్టివేయమంటావా?" అని బెదిరించేవారు. అప్పటికీ లొంగనివారిని కాళ్లూచేతులూ కట్టివేసి, ఆ సరస్సులోకి త్రోసి వేసేవారు. అలా వేలాదిమంది అస్థిపంజరాల కుప్పతో ఏర్పడినదే ఆ 'బాటా మజార్' దీవి. ఈ మాటలకు అర్థం– 'కాశ్మీరు పండితుల స్మశాన భూమి' అని.

అయితే... పఠాన్‌ల పాలన ఎక్కువ కాలం సాగలేదు. అనతికాలంలోనే లాహోర్‌ను పాలించే సిక్కురాజులు కాశ్మీర్‌ను కైవశం చేసుకున్నారు. అప్పుడు సిక్కు ప్రభువు బ్రాహ్మణ పురోహితులను పిలిచి మహమ్మదీయులుగా మారిన కాశ్మీరీ పండితులను తిరిగి హిందూ ధర్మంలోకి తీసుకురావలసినదిగా కోరాడు.

అప్పుడు వారు–

"కుక్క ముట్టుకున్న కూడుని ఇంట్లోకి తెచ్చుకుంటామా? అలాగే ఏ విధంగా మారినా ఒకసారి మహమ్మదీయులుగా మారి మైలపడ్డ వారిని తిరిగి హిందూధర్మంలోకి తీసుకువచ్చే ప్రసక్తే లేదు" అని మూర్ఖంగా బదులిచ్చారు.

గత్యంతరం లేక, వారంతా మహమ్మదీయులుగానే ఉండిపోయారు.

ఈనాడు కాశ్మీర్‌లో ఉన్న అత్యధిక ముస్లింల పూర్వీకులు అలనాటి కాశ్మీరీ పండితులే! షేక్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా పూర్వీకులు 'కేల్' వంశానికి చెందిన కాశ్మీరీ పండిత బ్రాహ్మణులు. ఆనాడు బ్రాహ్మణ మతపెద్దల మూర్ఖ ప్రవర్తన వల్ల ఎన్నో దశాబ్దాలుగా కాశ్మీరీ ప్రజలు, ముఖ్యంగా హిందువులు చెప్పలేని కష్టాలకు గురి అయినారు. అప్పుడు వారు, ఆ మతాంతరం చెందిన హిందువులను తిరిగి హిందూధర్మంలోకి తెచ్చుంటే ఈనాడు ఈ పరిస్థితి ఉండేది కాదు. ఇది వారు చేసిన ఘోరమైన చారిత్రక తప్పిదం!

హిందువులకు– శత్రువుల పట్ల అర్థంలేని ఔదార్యం చూపుతూ తమకు ముప్పు తెచ్చుకోవటం అలవాటే! 'అపకారికి ఉపకారము', 'చంపదగిన యట్టి శత్రువు చేత చిక్కిననేని చంపవలదు– పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు!' వంటి నీతివాక్యాలలో పిచ్చినమ్మకం ఎక్కువ.

'ఋణశేషం, వ్రణశేషం, శత్రుశేషం ఉండకూడదు' అన్న రాజనీతిని పాటించివుంటే భారతదేశ చరిత్ర మరోవిధంగా ఉండేది. లేకుంటే దేశంపై పద్దెనిమిదిసార్లు దండయాత్ర చేసిన మహమ్మద్ ఘోరీని ప్రతిసారీ క్షమించి, ప్రాణాలతో వదలటమేమిటి? చివరికి తనను క్షమించిన పృథ్వీరాజ్‌నే సంహరించి జయం సాధించాడు ఘోరీ.

సరే... ఇదంతా గతచరిత్ర!

స్వచ్ఛమైన ధవళ కాంతులీనే మంచుకొండలు ఈనాడు కాశ్మీరంలో నెత్తురోడుతూ అరుణ కిరణాలను వెదజల్లుతున్నాయి.

అది... కార్గిల్ ప్రాంతం!

ఎప్పుడూ, ఎవ్వరూ ఆ పేరు వినని ప్రాంతం ఒక్కసారి వార్తలలోకి ఎక్కింది!

భారతసైన్యపు సరిహద్దు బలగాలు నియంత్రణ రేఖ వెంబడి నిత్యం పహారా కాస్తూనే ఉన్నాయి. అయితే 'తీర్థం దారి తీర్థానిది, ప్రసాదం దారి ప్రసాదానిదీ!' అన్నట్లు ఒకప్రక్క సైనిక నిఘా సాగుతుండగానే పాకిస్థాన్ దళాలు దొంగచాటుగా నియంత్రణ రేఖ దాటి కార్గిల్ ప్రాంతంలోని కొన్ని భారత భూభాగాలను కబళించివేశాయి. విచిత్ర

మేమిటంటే... ఈ సమాచారం పశువుల కాపర్ల ద్వారా సైనిక చెక్‌పోస్టులకి అందడం. అది నిజమని తేలడంతో భారతదళాలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాయి. ఆ తర్వాత పాకిస్థాన్ సైన్యంతో అప్రకటిత యుద్ధం జరగటం, కార్గిల్ ప్రాంతాన్ని తిరిగి స్వాధీన పరచుకోవడం– ఈ క్రమంలో వందల భారత సైనికుల ప్రాణాలు అర్పణ కావడం... ఇదంతా వర్తమాన చరిత్రలో భాగం!

దెబ్బతిన్న పులి మిన్నకుండలేదు. అదను చూసి పంజా విసురుతుంది. అలాగే తోక తొక్కిన తాచు ఊరుకోదు. పగబట్టి మాటువేసి మరీ కాటు వేస్తుంది. పాకిస్థాన్ కూడా పులి కన్నా, పాము కన్నా తక్కువేం కాదు. మహమ్మద్ ఘోరీ భారత్ మీద దాడి చేసి పదేపదే ఓడిపోయినా, మళ్లీమళ్లీ దాడి చేసేవాడు. అతన్ని ఆదర్శంగా తీసుకొని మూడు ప్రధాన యుద్ధాలలో చిత్తుగా ఓడిపోయినా పాకిస్థాన్- భారత్‌పై కయ్యానికి కాలు దువ్వుతూనే ఉంటుంది. (ఘోరీ వారికి ఆరాధ్యుడు కనుకనే ఒక క్షిపణికి 'ఘోరీ' అని పేరు పెట్టారు.) ఈ కోవలో కార్గిల్ పరాభవం పొందినా పాకిస్థాన్ దొంగదెబ్బ తీయాలని చూస్తూనే ఉంది.

శీతాకాలంలో కొండలపై మంచు పేరుకుని దాటడానికి అభేద్యంగా ఉంటుంది. వేసవిలో మంచు కరిగిపోతుంది. అయితే అప్పుడు నిశితంగా ఉండే నిఘా వల్ల చొరబాట్లు కష్టమవుతాయి. శీతాకాలానికీ, వేసవికీ మధ్యన వుండే కాలం దొంగచాటు చొరబాట్లకు చాలా అదనుగా ఉంటుంది. ఈ వాస్తవం ఎరిగిన పాకిస్థాన్ కొత్తగా వ్యూహరచన మొదలుపెట్టింది.

కాశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్ నియంత్రణ రేఖకు దగ్గరగా ఉంటుంది.

అక్కడ జనావాసాలున్న పల్లెలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఆ పల్లెలలో సిక్కులు, హిందువులు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉంటారు. మహమ్మదీయులది అత్యధిక జనాభా అని వేరే చెప్పనక్కరలేదు. ఆక్రమిత కాశ్మీర్ నుంచి కొందరిని సిక్కుల, హిందువుల వేషాలలో ఈ గ్రామాలలో ప్రవేశపెట్టగలిగితే వారు సులువుగా ఆ గ్రామస్థులతో కలిసిపోగలరు. కాశ్మీర్ భాష సాంప్రదాయాలు, సంస్కృతి తెలిసివున్న వీరికి ఇబ్బంది ఏమీ ఉండదు. అలా ప్రవేశించిన తర్వాత ఆ ప్రాంతంలో ఉండే పాకిస్తానీయుల శక్తులతో చేతులు కలిపి విధ్వంస రచన చేయవచ్చు.

– ఇదీ పాకిస్థాన్ వ్యూహం! దీనిప్రకారం కొంధరిని చిన్నచిన్న దళాలుగా ఆ గ్రామాల్లో ప్రవేశపెట్టగలిగింది కూడా.

చిన్నగ్రామాలలో ఒక ఇబ్బంది ఉంటుంది. పల్లె జనాభా తక్కువగా ఉంటుంది కనుక కొత్తవారు ఎవరైనా వస్తే ఇట్టే గుర్తుపడ్తారు ఊరివారు. కనీసం ఇద్దరు ముగ్గురైనా "వారు ఎవరు? ఎవరికోసం వచ్చారు? ఎందుకు వచ్చారు?" వంటి ప్రశ్నలతో ఆరా తీస్తారు. అందువల్ల జాగ్రత్తగా తెలిసినవారి పేర్లు చెప్పి, సంతకోసం వచ్చామనో, ఏదో నమ్మబలకవలసి ఉంటుంది. ప్రతి పల్లెలోనూ, లేదా కొన్ని పల్లెలకి కలిసే వారంలో ఒకరోజు సంత ఉంటుంది. సంతకి ఊరివారే కాక బయటివారు కూడా వస్తారు. కనుక జనంతో కలిసిపోవడం సులువు.

కాశ్మీర్‌కి చెందినవారైతే మరింత సులువు! అందువల్ల ఆక్రమిత కాశ్మీర్ నుంచి పాకిస్థాన్‌లో కల కాశ్మీరీలను ఈ సంతలకు పంపుతుంటుంది పాకిస్థాన్.

గత కొద్దికాలంగా రాజౌరీ సెక్టార్‌లోని కొన్ని గ్రామాలలో కొత్తవ్యక్తుల కదలకలు కనిపిస్తున్నాయన్న సమాచారం నిఘా విభాగాలకు అందింది. విద్రోహశక్తులు ఏకమవుతున్నాయనీ, పెద్దయెత్తున విధ్వంసానికి పథకాలు చేస్తున్నాయనీ వార్తలు రాసాగాయి. సైనికులు వెళ్లి ఇళ్లల్లో గాలిస్తే అంతగా ప్రయోజనం ఉండదు. వారి రాకను ముందే పసిగట్టి పారిపోతారు. లేదా మకాం మార్చేస్తారు.

అందువల్ల 'దొంగను దొంగే పట్టాలి' అన్నట్లు– మామూలు మనుషులుగా సంచరించే ఉగ్రవాదులను పట్టుకోవాలంటే సైనికులు కూడా సాధారణ పౌరులుగానే సంచరించి ఆరాలు తీయాలి.

ఈ దిశలో సరిహద్దు భద్రతా దళాల అధికారులు సైనికులతో నలుగురేసి ఉండే దళాలను ఏర్పరచారు. వీరు మామూలు కాశ్మీర్ పౌరుల వేషధారణలో ఉంటారు. ప్రజల మధ్య మెలిగి ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారాన్ని రాబడతారు. ఊరిపెద్దలు ఎవరికైనా అనుమానం వచ్చి నిగ్గదీస్తే అప్పుడు తమ ఐడెంటిటీ కార్డు చూపి వారు వచ్చిన పని గూర్చి రహస్యంగా చెప్తారు.

అలా ఏర్పరచిన ఒక దళంలో సజ్జన్‌సింగ్, అబ్దుల్ హమీద్, సంజయ్‌భట్, మన్‌హన్ హండూలు సభ్యులుగా ఉన్నారు. వీరు నలుగురూ కాశ్మీరీలే. సజ్జన్‌సింగ్ రాజౌరీ ప్రాంతానికి చెందిన సర్దార్జీ. అబ్దుల్ హమీద్ అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన వాడు. మిగిలిన ఇద్దరూ జమ్మూ ప్రాంతానికి చెందిన కాశ్మీరీ పండితులు. వీరందరూ కాశ్మీరీ సంస్కృతినీ, సాంప్రదాయాలనూ పుణికి పుచ్చుకున్నవారు కనుక ఆ ప్రాంత ప్రజల మధ్య మెలగడానికి ఇబ్బంది కలగలేదు.

వారు అవసరమైనప్పుడు బృందంగా వెళ్లేవారు. లేకుంటే ఒక్కరొక్కరుగా, వేరే వేరే జట్లుగా వెళ్లి ఆరా తీసేవారు.

ఆరోజు అబ్దుల్ హమీద్ ఊరి సంతకు వెళ్లాడు. అక్కడ అనుకోకుండా చిన్ననాటి స్నేహితుడు సిరాజుద్దీన్ కనిపించాడు. ముందు కొంతసేపు ఒకరినొకరు తేరిపార చూసుకున్నారు. తర్వాత ఇద్దరూ ఒకరినొకరు గుర్తుపట్టారు. వెంటనే గాఢాలింగనం చేసుకొన్నారు. "అరెఁ... సిరాజ్‌భాయ్! మనం కలుసుకుని ఎన్నాళ్లయింది! ఇప్పుడేం చేస్తున్నావు?" అని అడిగాడు హమీద్.

"సంతలో పశువుల బ్రోకర్‌గా పనిచేస్తున్నాను. వారంలో ఒక్కోరోజు ఒక్కో ఊరిలో సంత జరుగుతుంటుంది కదా... ఒకదాని తర్వాత ఒకటి ప్రతి సంతకీ వెళ్తుంటాను!" అన్నాడు సిరాజ్.

"మరి, స్థిరనివాసం ఎక్కడ?"

"నేనెక్కడుంటే అదే నా స్థిరనివాసం!"

"మరి- పెళ్ళాం బిడ్డలూ, ఇల్లూ వాకిలీ..?"

"నాకా బాదరబందీ లేదు. నేను పెళ్ళి చేసుకోలేదు."

"మరి, నువ్వు సంపాదించేది ఎవరి కోసం?"

"సంపాదించినంతలో నాకు ఏ లోటు లేకుండా హాయిగా గడుపుతాను. సంసారం ఉంటే ఈ సాతంత్ర్యం ఎక్కడుంటుంది?"

"మరి, నువ్వు సంపాదించిన దాంట్లో మిగిలింది ఏం చేస్తావు? నీ తర్వాత నీ డబ్బుని అనుభవించేదెవరు?"

"అనుభవించాల్సింది పెళ్ళాం బిడ్డలేనా?! అల్లా దయవల్ల బాగానే సంపాదిస్తున్నాను. నా అవసరాలకు పోను మిగిలినదానిని ఏ మసీదుకో, మదరసాకో దానం చేస్తాను. ముస్లింగా పుట్టాక ఆమాత్రం చేయకపోతే ఎలా?"

"బాగుంది... ఈ వయసులోనే ఆధ్యాత్మికత ఒంటపట్టించుకున్నావన్నమాట!"

"ఎప్పటికైనా కావలసిందిదేగా! నా సంగతి సరే... నువ్వేం చేస్తున్నావు?" అని అడిగాడు సిరాజ్.

'తన విషయం చెప్పాలా, వద్దా...' అని కొంచెం తటపటాయించాడు హమీద్. అల్లా నామం జపిస్తూ, మత ధర్మాలను పాటిస్తూ, ఆధ్యాత్మికతను వంటపట్టించుకున్న చిన్ననాటి మిత్రునికి చెప్తే నష్టమేమీ లేదనుకున్నాడు.

"నేను భారతసైన్యంలో జవాన్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడ ఉగ్రవాదుల కార్యకలాపాలు ఆరా తీయడానికి వచ్చాను" అన్నాడు.

సిరాజ్ ఒక్క నిమిషం హమీద్ వంక తేరిపార చూశాడు.

"అంతా పాకిస్థాన్‌లో కలవాలంటావా?"

"కలిసినా తప్పులేదు. లేదా, కాశ్మీర్ స్వతంత్ర ముస్లిం దేశంగా ఉండాలి. అంతేకాని, భారత్‌లో మాత్రం కలవకూడదు."

"పాకిస్థాన్‌లోని ముస్లింలకన్నా ఇండియాలోని ముస్లింల సంఖ్య ఎక్కువ! ఇక్కడ అందరూ భారతీయులే... అందరికీ సమాన అవకాశాలు... అందరి పట్లా సమదృష్టి! ఇప్పటికి మూడుసార్లు ముస్లింలు భారత రాష్ట్రపతి కాగలిగారు. ముస్లింలు కాని వారెవరైనా పాకిస్థాన్ అధ్యక్షులు కాగలరా?"

"అదంతా కీలుబొమ్మల్ని చేతిలో పెట్టుకుని ప్రపంచాన్ని నమ్మించడానికి భారత్ ఆడే నాటకం! ఉంటే మొఘలాయిలలాగా దేశాన్ని పాలించాలి. లేదా, పాకిస్థాన్ లాగా కాశ్మీర్ కూడా ప్రత్యేక ముస్లిందేశం కావాలి. అంతేకాని, ఏ మాత్రం పోలికా, పొంతనా లేని హిందువులతో పొసగడం మాత్రం కుదరదు!" కొంచెం ఆవేశంగా అన్నాడు సిరాజ్.

సిరాజ్ విషయం తెలుసుకోకుండా తాను భారత సైన్యంలో పనిచేస్తుండిన విషయం అనవసరంగా చెప్పి తప్పు చేశానేమోనని పశ్చాత్తాప పడసాగాడు హమీద్. ఇంక ఆ సంభాషణని కొనసాగించడం ఇష్టంలేక, "సరే భాయ్! మనం మళ్లీ కలుసుకొని చాలా విషయాలు మాట్లాడుదాం!" అన్నాడు హమీద్.

"సరే..." అన్నాడు సిరాజ్ ముక్తసరిగా.

"మళ్లీ ఎప్పుడు కలియడం? ఎక్కడ కలియడం?"

"వచ్చేవారం ఇదే రోజున- ఇదే సంతలో! ప్రొద్దున ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు వరకు ఇక్కడే ఉంటాను" అన్నాడు సిరాజ్.

"మంచిది. వెళ్లొస్తాను... ఖుదా హాఫీజ్!"

"ఖుదా హాఫీజ్!"

కలత చెందిన మనసుతో వెనుదిరిగాడు హమీద్.

అదే సమయంలో అటు వచ్చాడు సజ్జన్ సింగ్. కొంచెం దూరం నుంచే వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూండడం చూశాడు. అబ్దుల్ హమీద్ దగ్గరకు వచ్చి, "ఎవరతను?" అని అడిగాడు.

"నా చిన్ననాటి స్నేహితుడు సిరాజుద్దీన్! మా ఊరివాడే, ఒకే బళ్లో చదువుకున్నాం!" అన్నాడు హమీద్.

"ఏం చేస్తుంటాడు?"

"సంతల్లో పశువుల బ్రోకర్‌గా పనిచేస్తున్నాడట! పదిహేనేళ్ల తర్వాత ఈరోజే కలుసుకున్నాం!"

"అయితే, అతనికి చాలామందితో పరిచయం ఉండవచ్చు. మనకి కావలసిన ఇన్‌ఫర్మేషన్‌ని జాగ్రత్తగా అడిగి తెలుసుకో! అప్పుడప్పుడు కలుస్తూండు!" అన్నాడు సజ్జన్ సింగ్.

అబ్దుల్ హమీద్ ఏమీ మాట్లాడలేదు. అతని మనసు మాత్రం అల్లకల్లోలంగా ఉంది.

●

పదిహేను రోజులు గడిచాయి!

భారత స్వాతంత్ర్య దినం- ఆగష్టు 15 ఇంక పది రోజులే ఉంది!

రాజౌరీ జిల్లాలో ఒక ఊరిలో ఒక జాగిర్దార్ ఇంట్లో తీవ్రవాదులు సమావేశం అవుతున్నారనీ, ఆగష్టు 15న శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో జరిగే భారత స్వాతంత్ర్యోత్సవాలను పెద్దయెత్తున విధ్వంసం చేయడానికి కుట్ర పన్నుతున్నారనీ, భారీమొత్తంలో ప్రేలుడు సామాగ్రిని కూడా సేకరించి దాచివుంచారని ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది.

దాంతో భద్రతాదళాలు అప్రమత్తమయ్యాయి...

గూఢచారులు ఆ ప్రదేశం ఎక్కడుందో కనిపెట్టగలిగారు.

'ఆపరేషన్ థండర్ బోల్ట్' పథకానికి రూపకల్పన చేశారు సైనికాధికారులు. దానిప్రకారం ఆ అర్ధరాత్రి సైనికదళాలు ఆ జాగీర్దార్ ఇంటిని అన్నివైపుల నుంచీ చుట్టుముట్టాయి.

ప్రాంగణం చుట్టూ వున్న ఎత్తైన గోడలపై నుంచి లోనికి గ్రానేడ్ విసిరారు సైనికులు. అందుకు జవాబుగా లోపల నుంచి తుపాకీ కాల్పులు ఎదురువచ్చాయి.

ఇంటి కాంపౌండ్ గేట్‌ను పేల్చివేసి లోనికి ప్రవేశించాయి భద్రతాదళాలు.

లోపలినుంచి కాల్పులు ఆగిపోయాయి.

జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగారు సైనికులు.

ఒక్క ఉదుటున ఇంటి తలుపులు పగులకొట్టి తుపాకీగుళ్ళ వర్షం కురిపిస్తూ లోనికి వెళ్లారు పరుగు పరుగున.

ఎదురుగుండా అంతా చీకటిగా ఉంది.

టార్చిలైట్ వేసి చూశారు. కొంచెందూరంలో ముగ్గురి మృతదేశాలు రక్తం మడుగులో పడివున్నాయి. మరో వ్యక్తి రక్తం మధ్యన కొట్టుకుంటున్నాడు. టార్చిలైట్ వెలుగులో ఆ వ్యక్తిని గుర్తుపట్టాడు హమీద్.

"అరేఁ... సిరాజ్‌భాయ్... నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏమిటి... ఇతను నీకు తెలుసా?" అని అడిగాడు కమాండర్.

"తెలుసు! నా చిన్ననాటి స్నేహితుడు... పేరు సిరాజుద్దీన్!" అన్నాడు హమీద్.

హమీద్ వంకా, సిరాజ్ వంకా తేరిపార చూశాడు సజ్జన్ సింగ్. ఆ మృతదేహాలను, క్షతగాత్రుడైన సిరాజుద్దీన్‌ను మిలటరీ హాస్పిటల్‌కి తరలించే ఏర్పాట్లుచేసి, ఆ ఇళ్లూ, ప్రాంగణం అంతా నిశితంగా పరిశీలించాడు కమాండర్ తన అనుయాయులతో.

ఎక్కడా మరే వ్యక్తీ కనిపించలేదు. ప్రేలుడు పదార్థాలు కూడా ఏమీ లభించలేదు.

●

కమాండర్ హర్నామ్ సింగ్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

తమకు అందిన సమాచారం స్పష్టంగా ఉంది. ఖాళీగా ఉండిన ఆ జాగీర్దార్ ఇంటిని ఈమధ్యనే ఎవరో కంపెనీవాళ్ళు అద్దెకు తీసుకున్నారట! కంపెనీ పేరు వెనక అక్కడ తీవ్రవాద కార్యకలాపాలు చేస్తున్నారట! కంపెనీ సరుకుల లాగా పెద్దపెద్ద కార్టన్‌లలో ప్రేలుడు పదార్థాలను అక్కడికి చేర్చారట!

మరి, అవి ఏమైనట్లు?

అంటే... ఈ 'ఆపరేషన్ థండర్ బోల్ట్' గురించి ఉగ్రవాదులకి సమాచారం లీక్ అయిందన్నమాట! అదెలా సాధ్యం! లేకుంటే... ఆ ప్రేలుడు సామాగ్రి అక్కడ లేకుండా ఎలా పోతుంది?!

"సార్... మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి!" అంటూ ప్రవేశించాడు సజ్జన్ సింగ్. ప్రశ్నార్థకంగా చూశాడు కమాండర్.

"ఆపరేషన్ థండర్ బోల్ట్ గురించి సమాచారాన్ని మన అబ్దుల్ హమీద్ వాళ్ళకి లీక్ చేసి ఉంటాడని నా అనుమానం!" అంటూ కొద్దిరోజుల క్రితం సంతలో వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుండగా తాను చూసిన విషయం చెప్పాడు.

"హమీద్ చాలా మంచివాడు... నమ్మకస్తుడు. అతను ఈ పనిచేశాడని నేననుకోను!" అన్నాడు కమాండర్.

"ఏం చేస్తాం సార్! పైకి అందరూ అలాగే ఉంటారు. ఎంతైనా వాళ్ళు, వాళ్ళు ఒకటే!" అన్నాడు సజ్జన్ సింగ్.

"రేపు సిరాజుద్దీన్‌ని ఇంటరాగేట్ చేసినప్పుడు నిజమేమిటో బయటపడ్తుంది. అప్పటివరకూ ఎవరినీ అనుమానించకూడదు" అన్నాడు కమాండర్.

•

మర్నాడు ఇంటరాగేషన్‌లో విభ్రాంతి కలిగించే విషయాలను వెల్లడిచేశాడు సిరాజుద్దీన్.

ఆ ఆపరేషన్ గురించిన సమాచారాన్ని తమకు లీక్ చేసింది అబ్దుల్ హమీదేనట! అందుకే ఆ క్రిందటి రాత్రే ప్రేలుడు సామాగ్రి నంతటినీ వేరేచోటికి తరలించేశారట! తమకు అందిన సమాచారం ప్రకారం ఆపరేషన్ తెల్లవారుజామున నాలుగు గంటలకు మొదలవుతుంది. కనుక తాము అక్కడి నుండి మూడు గంటలకు వెళ్ళిపోవాలనుకున్నారట. కాని, అది రెండు గంటలకే మొదలుకావడంతో ముగ్గురు చనిపోవడం లేదా చిక్కడం జరిగిందట!

సజ్జన్ సింగ్ అనుమానం నిజమేననిపించింది.

అబ్దుల్ హమీద్‌ను తన ఛాంబర్‌కి పిలిపించాడు కమాండర్. ఆయన ముఖం చాలా గంభీరంగా ఉంది.

సెల్యూట్ చేసి నిలబడ్డాడు హమీద్.

"హమీద్! 'ఆపరేషన్ థండర్ బోల్ట్' గురించిన సమాచారం ఉగ్రవాదులకు లీక్ చేసింది నువ్వేనని మాకు సమాచారం అందింది. సిరాజుద్దీన్ స్వయంగా చెప్పాడు ఇంటరాగేషన్‌లో! కొద్దిరోజుల క్రితం నువ్వు, సిరాజుద్దీన్ సంతలో మాట్లాడుకుంటుండగా చూశానని సజ్జన్ సింగ్ చెప్పాడు. ఇదంతా చూస్తే నువ్వే లీక్ చేశావనిపిస్తోంది. దీనికి నువ్వేమంటావు?" అన్నాడు కమాండర్.

మబ్బుల్లేని పిడుగు నెత్తిన పడినట్లయింది హమీద్‌కి.

"సార్, మీరు నన్ను అనుమానిస్తున్నారా? నా పేరు అబ్దుల్ హమీద్ సర్! ఆ పేరు ఎలా వచ్చిందో చెప్పమంటారా! 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో కమాండర్ అబ్దుల్ హమీద్ వీరోచితంగా పోరాడి అసువులు బాశాడు. దేశభక్తుడైన మా నాన్నని ఆ

ఉందంతం కదిలించి వేసింది. ఆయన కూడా భారతసైన్యంలో పనిచేసినవాడే! అబ్దుల్ హమీద్ ప్రాణత్యాగంతో స్ఫూర్తి చెందిన ఆయన- అదే సంవత్సరంలో పుట్టిన నాకు 'అబ్దుల్ హమీద్' అని పేరు పెట్టారు. దేశాభిమానం రక్తంలో జీర్ణించిన వంశం సార్ మాది. అటువంటి నేను దేశద్రోహానికి తలపడ్తానా?" అంటూ ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేశాడు.

"నేనేమీ చేయలేను. ఒకసారి అనుమానం వచ్చాక నిన్ను భారతసైన్యంలో ఉంచడం అసాధ్యం! అయితే నాకు నీమీద నమ్మకం ఉంది కనుక నిన్ను కోర్ట్‌మార్షల్ చేయకుండా 'డౌట్‌ఫుల్ ఇంటెగ్రిటీ' అన్న క్లాజ్ మీద బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇచ్చి సర్వీసు నుంచి తొలగిస్తాను. అంతకుమించి నేనేమీ చేయలేను" అన్నాడు కమాండర్.

ఇంక ఆయన్ని ప్రాధేయపడి లాభం లేదనుకున్నాడు హమీద్.

"సార్! మీరు నాకు ఒక్క సాయం చేయండి. సిరాజుద్దీన్ నామీద ఈ అబద్ధాలు ఎందుకు చెప్పాడో తెలియదు. ఒక్కసారి అతన్ని కలిసి మాట్లాడే అవకాశం ఇవ్వండి!" అన్నాడు హమీద్.

–అందుకు ఒప్పుకొని, సెంట్రీని ఎస్కార్ట్‌గా ఇచ్చి పంపాడు కమాండర్.

"నువ్వు కాఫిర్‌లతో చేతులు కలిపి సోదర ముస్లింలకు అపకారం చేస్తున్నావు. అటువంటి నిన్ను ఆ కాఫిర్‌లే ఉరి తీయాలని అలా చెప్పాను" అన్నాడు సిరాజ్.

హమీద్ తిరిగివచ్చి సిరాజ్ అన్న మాటలు కమాండర్‌కు చెప్పాడు. కమాండర్ అతని నిజాయితీని గుర్తించాడు. లోపల చాలా బాధపడ్డాడు.

"నువ్వు చెప్పింది నిజమని తెలిసినా నేనేమీ చేయలేను. ఎందుకంటే సిరాజ్ ఆ విషయం నాముందు ఒప్పుకోడు. నువ్వే లీక్ చేశావని చెప్తాడు. నువ్వు చెప్పిన మాటలకు సాక్ష్యం లేదు. అందువల్ల నిన్ను తొలగించడం తప్ప నేను మరేమీ చేయలేను" అన్నాడు కమాండర్.

"అలాగే చేయండి సార్! నా దురదృష్టానికి మీరేమి చేస్తారు? మాతృభూమి ఋణం తీర్చుకోడానికి సైన్యంలోనే పనిచేయనవసరం లేదు" అంటూ కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

మళ్లీ పర్మిషన్ తీసుకొని సిరాజుద్దీన్‌ని కలిశాడు.

"సిరాజ్ భాయ్! నువ్వన్నట్లు కాఫిర్‌లతో చేతులు కలిపి నేను ఇంతకాలం పెద్ద పొరబాటు చేశాను. ఇన్నాళ్లు సేవ చేస్తే ఆ కాఫిర్లే ఇవాళ నన్ను ఉద్యోగం నుంచి

తొలగించారు. నా మనస్సు విరిగిపోయింది. నేను కూడా మీ ఉగ్రవాదులలో చేరిపోయి నా ప్రతీకారం తీర్చుకుంటాను" అన్నాడు ఆవేశంగా.

సిరాజుద్దీన్‌కు కావలసిందే అది!

"ఇప్పటికైనా నిజం గ్రహించావు. అల్లా భలా కరేగా!" అంటూ భుజం తట్టాడు. అతడితో నెమ్మదిగా ఆ మాట, ఈ మాట మాట్లాడి ఆ ఉగ్రవాదుల అనుపానులు తెలుసుకున్నాడు హమీద్.

"ఖుదా హాఫీజ్!" చెప్పి బయటకు వచ్చాడు. తిరిగి కమాండర్ దగ్గరికి వెళ్లి,

"సార్... నేను భారతీయ సైనికుణ్ణి! నన్ను నమ్మకద్రోహం క్రింద బయటికి పంపకుండా కోర్ట్‌మార్షల్ చేసి నా ప్రాణాలు తీసివుంటే ఎంతో సంతోషించేవాడిని. ఈ నింద మోస్తూ జీవించడం కష్టం!" అంటూ కళ్ళు తుడుచుకొని ఆయన దగ్గర సెలవు తీసుకున్నాడు.

"నువ్వు నిర్దోషివని నేను నమ్ముతున్నాను. కానీ, ఏమీ చేయలేను. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్!" అన్నాడు కమాండర్ ఆవేదనతో.

మరునాడే ఆగష్టు 15.

బక్షి స్టేడియంలో భారత స్వాతంత్ర్య దినోత్సవంలో జరుపుకుంటున్న ప్రముఖ నాయకులను- ప్రేలుడు పదార్థాలు నిండివున్న ట్రక్కుని నడుపుకుంటూ వెళ్లే మానవ బాంబు ద్వారా హత్య చేయాలని పథకాన్ని వేశారు ఉగ్రవాదులు. సిరాజ్ ఆదేశంపై అబ్దుల్ హమీద్‌ని ఆ మానవబాంబుగా మలిచారు.

ప్రేలుడు సామాగ్రితో నిండివున్న ట్రక్కును వేగంగా నడుపుకుంటూ వెళ్తున్నాడు అబ్దుల్ హమీద్. స్టేడియంకి దగ్గరలో ఉన్న ఒక మేడపై నుంచి బైనాక్యులర్స్ ద్వారా స్టేడియంలో జరుగుతున్న దానిని గమనిస్తున్నారు ఇరవైమంది కరుడుకట్టిన ఉగ్రవాదులు.

ట్రక్కు స్టేడియంలోకి సమీపిస్తోంది!

పోలీసు వలయాన్ని ఛేదించుకొని లోపలికి దూసుకుపోవడమే తరువాయి! సడన్‌గా ట్రక్కు దారి మారింది. అమితవేగంతో వెళ్లి ఉగ్రవాదులున్న ఇంటిని ఢీకొంది. ఆ ప్రేలుడికి ఆ భవనం పేకమేడలా కూలిపోయింది. ఆ మంటల్లో ఉగ్రవాదులందరూ మాడి మసైపోయారు.

అబ్దుల్ హమీద్ దేహం తునాతునకలై అన్నివైపులా పడింది.

ఆ వార్త తెలిసి కమాండర్ తన అనుయాయులతో అక్కడికి వచ్చాడు.

అంతా గందరగోళం!

రోడ్డు మీద జనం ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ ఆఫీసర్ హర్నామ్ సింగ్ దగ్గరకు వచ్చాడు.

"సార్! నిన్న మా ఆఫీసుకి నా పేర ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఒక సీల్డ్ కవర్ ఉంది. మీరు ఈరోజు స్టేడియం దగ్గరికి వస్తారని ఆ కవర్ని ఈయమని ఒక సైనికుడు రాసిన ఉత్తరం ఉంది. ఇదే ఆ ఉత్తరం!" అంటూ ఆ ఉత్తరాన్ని అందించాడు. దానిని పరీక్షించి, ప్రమాదమైనది కాదని నిర్ధారించుకుని, ఆ కవర్ని తెరిచి అందులోని ఉత్తరాన్ని చదివాడు హర్నామ్ సింగ్.

"సర్!

చేయని నేరానికి నామీద నింద పడి నేను ఉద్యోగం పోగొట్టుకున్నాను. ఒక సైనికుడిగా మాతృభూమి సేవచేస్తూ ఆ సేవలోనే ప్రాణాలు త్యజించబోతున్నాను. నిందతో జీవించడం నా వల్ల కాదు. అదికూడా దేశద్రోహం అన్న నింద మీద! సైన్యంలో లేకపోయినా బయటనుంచి నా మాతృదేశ ఋణం తీర్చుకోవాలనుకున్నాను. అందుకే తీవ్రవాదులతో చేతులు కలిపినట్లు నటించి, వారిని అంతమొందించడమే కాక రాష్ట్ర నాయకులకు కలగబోయిన పెద్దప్రమాదాన్ని తప్పించ నిశ్చయించుకున్నాను. ఈ ప్రయత్నంలో నా ప్రాణాలు పోతాయని నాకు తెలుసు. అది నాకు ఆనందకరమే! ఇప్పటికైనా నా నిజాయితీని నమ్మితే అంతేచాలు.

ఎప్పటికీ సెలవు.

మీ

మాజీ జవాన్ అబ్దుల్ హమీద్."

– అని ఉంది అందులో.

కమాండర్ హర్నామ్ సింగ్ కళ్ళు అశ్రుపూరితమయ్యాయి.

'నువ్వన్నట్లు ఈ విధంగా మాతృభూమి ఋణం తీర్చుకున్నావా హమీద్!' అని మనసులో అనుకుంటూ గౌరవసూచకంగా టోపీని దించాడు.

'జాగృతి' వారపత్రిక . . . 5 మే, 2003